# ఈ నెల 11న జిల్లా ఇన్చార్జి మంత్రి రాక

• అదనపు పి.ఎస్. టు మినిస్టర్ నానిల్ కుమార్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:**
ఈ నెల 11వ తేదీన రాష్ట్ర ఆబ్కారీ మద్య నిషేధ, పర్యాటక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాకు రానున్నారని అదనపు పి.ఎస్. టు మినిస్టర్ నానిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వ తేదీ ఉదయం 9 గంటల నుండి 10 గంటల వరకు ఆసిఫాబాద్ మండలం మాణిక్ గూడ గ్రామంలో గ్రామపంచాయతీ భవనం, కెరమెరి మండలం ధనోరలో వి.ఓ. భవనం, వాంకిడి మండలం కోమటిగూడలో గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభిస్తారని తెలిపారు. 10.30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని వడపల్లి గార్డెన్ లో ఏర్పాటు చేసిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అవగాహన కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు.

# కార్మిక నేత వంగూరి వెంకటేశ్వరరావుకు ఘన నివాళి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** కార్మిక హక్కుల సాధన కోసం జీవితాంతం పోరాడిన వంగూరి వెంకటేశ్వరరావు (గణేష్) ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ అన్నారు. వేంసూరు మండలంలోని రాయుడుపాలెం గ్రామానికి చెందిన ఆటో, భవన నిర్మాణ కార్మికుడు వంగూరి వెంకటేశ్వరరావు గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సీఐటీయూ నాయకులు గ్రామానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ల భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి పుష్పగుచ్ఛాలు సమర్పించి, నినాదాల మధ్య తుది వీడ్కోలు పలికారు. అనంతరం మల్లూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్మికుల ఐక్యత, హక్కుల పరిరక్షణ కోసం వంగూరి వెంకటేశ్వరరావు నిరంతరం కృషి చేశారని కొనియాడారు. సీపీఎం పార్టీ బలోపేతం, కార్మిక ఉద్యమాల అభివృద్ధికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు, ఆటో వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు డంకర శ్రీను, మెకానిక్ల సంఘం మండల అధ్యక్షుడు కావూరి భగత్ సింగ్, సీఐటీయూ నాయకులు సాధు శరత్ బాబు, ఆంజనేయులు, షకూర్, గ్రామ సర్పంచ్ మేకల ఇందిరమ్మ–రమేష్, కార్మికులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** విద్యార్థుల విద్యాభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేయూత నందిస్తూ ఆదర్శంగా నిలిచారు. ఖమ్మం జిల్లా వేంసూరు మండలంలోని వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్బుక్స్, గైడ్లను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భీమిరెడ్డి మురళీధర్ రెడ్డి, పాల యుగంధర్ రెడ్డి, ఏదుళ్ల పుల్లారావు, వంశీ స్వచ్ఛందంగా విద్యా సామాగ్రిని అందజేసి పాఠశాల పట్ల తమకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వేంసూరు మండల విద్యాశాఖ అధికారి చలంచర్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తమ పాఠశాల అభివృద్ధికి చేయూతనివ్వడం అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిబాబు పూర్వ విద్యార్థుల సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ఈ విద్యా సామగ్రిని సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కర్రి విజయ, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నేటి విద్యా సంస్థల బంద్ ను విజయవంతం చేయాలి



**ఉద్యమ కెరటం, వరంగల్:** విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థల బంద్ ను విజయవంతం చేయాలని ఏఐఎస్బీ రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ కోరారు. గురువారం ఆయన మాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై ఎంతోకాలం గడిచినా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కొరత కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను తగ్గించే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ఎంఈఓ, డీఈఓ, లెక్చరర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు అందించడంతో పాటు మధ్యాహ్న భోజన పథకానికి తగిన నిధులు కేటాయించాలని కోరారు. ఈ బంద్లో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు, విద్యార్థి సంఘాలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ప్రాణాలను అరచేతిలో పెట్టు కుని ప్రయాణం..!

• ప్రమాదకరంగా మారిన కల్వర్టు ..!
• పట్టించుకునే నాథుడే లేడు...



**ఉద్యమ కెరటం, వాంకిడి:**
వాంకిడి మండలంలోని సరండి గ్రామ ప్రధాన రహదారి ప్రస్తుతం అత్యంత ప్రమాదకరంగా మారింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కల్వర్టు ఇరువైపులా మట్టి భారీగా కొట్టుకు పోయింది. నీటి ఉద్ధృతికి కల్వర్టు కింద నేల పూర్తిగా కుంగిపోవడంతో, సిమెంట్ నిర్మాణం గాలిలో వేలాడుతున్నట్లు తయారైంది. ఈ మార్గంలో నిత్యం ప్రయాణించే వందలాది మంది వాహనదారులు, స్కూల్ బస్సులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. వర్షాలు ఇలాగే కొనసాగితే రోడ్డు పూర్తిగా తెగిపోయి, పరిసర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ప్రమాద తీవ్రత మరింత ఎక్కువగా ఉంటోంది. అధికారులు ఇక్కడ కనీసం బ్యారికేడ్లు, రిఫ్లెక్టర్లు లేదా హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా మట్టి పోసి తాత్కాలికంగా చేతులు దులుపుకుంటున్నారని, శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను నిర్మించకపోవడమే దీనికి కారణమని మండిపడుతున్నారు.ఈ నేపథ్యంలో దెబ్బతిన్న కల్వర్టుకు వెంటనే అత్యవసర మరమ్మతులు చేపట్టాలని, ప్రమాద స్థలంలో తక్షణమే బ్యారికేడ్లు, హెచ్చరిక బోర్డులు పెట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే రహదారి ఇరువైపులా బలమైన రక్షణ గోడ నిర్మించాలన్నారు. పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి అధికారులు, జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి పెద్ద ప్రమాదం జరగక ముందే శాశ్వత చర్యలు చేపట్టాలని సరండి గ్రామస్థులు కోరుతున్నారు.

# ప్రాజెక్ట్ సమస్యలను మంత్రి జూపల్లిదృష్టి కి తీసుకెళ్తాం

• కుమురం భీం ప్రాజెక్ట్ పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, విశ్వ ప్రసాద్ రావు





**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:**
ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆసిఫాబాద్ మండలం ఆడ గ్రామం వద్ద గల కుమురం భీం ప్రాజెక్టును మాజీ డీసీసీ అధ్యక్షులు కె.విశ్వ ప్రసాద్ రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు గురువారం సాయంత్రం సంయుక్తంగా సందర్శించారు.ఈ సందర్భంగా వారు ప్రాజెక్ట్ ఆనకట్ట, గేట్లు కాలువలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టుకు సంబంధించిన అత్యవసర మరమ్మత్తు పనులు, నీటి నిల్వ సామర్థ్యం, భద్రతా ప్రమాణాల తదితర విషయాలపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో వారు చరవాణి ద్వారా సుదీర్ఘంగా చర్చించారు.అనంతరం కె.విశ్వ ప్రసాద్ రావు, ఆత్రం సక్కు మాట్లాడుతూ కుమురం భీం ప్రాజెక్టు పరిధిలోని రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. ప్రాజెక్టుకు అవసరమైన పూర్తి స్థాయి మరమ్మతుల విషయంపై జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. మంత్రి తో మాట్లాడి, అవసరమైన నిధులు మంజూరు చేయించి, ప్రాజెక్టును పూర్తి స్థాయిలో పునరుద్ధరించేలా ప్రత్యేక కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. వీరి వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్, ఎన్ ఎస్ యూ ఐ నాయకుడు ఎండీ జమీర్ అహ్మద్, పలువురు నాయకులు ఉన్నారు.

# చిల్డ్రన్స్ పార్క్లో పారిశుద్ధ్య పనుల పరిశీలన

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :**
పట్టణంలోని కోట్నాక భీం రావు చిల్డ్రన్స్ పార్క్లో గురువారం మున్సిపల్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులను చేపట్టారు. ఈ పనులను మున్సిపల్ చైర్పర్సన్ ఆకాష్, వైస్ చైర్పర్సన్ ఎండి అహ్మద్, కౌన్సిలర్ రాపర్తి కార్తీక్ లు స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ ఆకాష్, వైస్ చైర్పర్సన్



ఎండి అహ్మద్ లు మాట్లాడుతూ పార్కును సందర్శించే చిన్న పిల్లలు, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిరంతరం పరిశుభ్రతను పాటించాలని పేర్కొన్నారు. వర్షాకాలం దృష్ట్యా దోమలు ప్రబలకుండా, అంటువ్యాధులు వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి, పార్కును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకుడు సాయి శ్రవణ్, మున్సిపల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలి





జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఉద్యమ కెరటం, కెరమెరి:**
ప్రభుత్వ పాఠశాలలను విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని జిల్లా కలెక్టర్ కెహరిత అన్నారు. గురువారం జిల్లాలోని కెరమెరి మండలం పెద్దపట్నాపూర్ లో గల గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల హాజరు పట్టిక, వంటగది, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో డ్రాప్ అవుట్ విద్యార్థులను గుర్తించి సోమవారంలోగా పాఠశాలలో ఉండేలా ఉపాధ్యాయులకు కృషి చేయాలని, ప్రతి విద్యార్థి ఆపార్ కార్డు కలిగి ఉండేలా చూడాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీరు అందించాలని తెలిపారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతంలో బీఎల్ఏల పాత్ర కీలకం

• మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావు

**ఉద్యమ కెరటం, జైనూర్:** కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో బిఎల్ఏల పాత్ర కీలకంగా ఉంటుందని, బిఎల్ఏలు అంకితభావంతో పనిచేయాలని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావు అన్నారు. గురువారం జైనూర్ మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో జైనూర్, సిర్పూర్ (యు) గ్రామ పంచాయతీలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయడంలో, ప్రజా సమస్యలపై సమర్థవంతంగా పోరాడడంలో బీఎల్ఏల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ విశ్వాసంతో అప్పగించిన బాధ్యతలను ప్రతిఒక్కరూ నిబద్ధతతో నిర్వర్తించాలని కోరారు. ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్ యాదవ్, సిర్పూర్ (యు) మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆత్రం శంకర్, సీనియర్ నాయకులు ఆత్రం బాలేరావు, మెస్రం భూపతి, సోయం సోనేరావు, పెందూర్ సాహెబ్ రావు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు, గ్రామ పంచాయతీ పరిధిలోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# బీజేపీ ఎండోన్మెంట్ సెల్ రంగారెడ్డి జిల్లా జాయింట్ కన్వీనర్గా...

- ఆర్. సతీష్ కుమార్ (నరేష్) నియామకం.
- ఆలయాల పరిరక్షణ, హిందూ ధర్మ ప్రచారానికి అంకితభావంతో పనిచేస్తా.
- సతీష్ కుమార్ (నరేష్).



**ఉద్యమ కెరటం, ఉమ్మడి రంగారెడ్డి :**
దేశంలోనే తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన బీజేపీ ఎండోన్మెంట్ సెల్ (ధార్మిక విభాగం) రాష్ట్ర వ్యాప్తంగా ధార్మిక సేవలు, ఆలయాల పరిరక్షణ, హిందూ సనాతన ధర్మ ప్రచారం కోసం కృషి చేయనున్నట్లు ఆ విభాగం రాష్ట్ర కన్వీనర్ అన్నా వజ్జుల సూర్య ప్రకాశ్ తెలిపారు. హైదరాబాద్లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన నియామక పత్రాల ప్రదాన కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ పదవులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్. సతీష్ కుమార్ (నరేష్) ను బీజేపీ ఎండోన్మెంట్ సెల్ (ధార్మిక) రంగారెడ్డి జిల్లా జాయింట్ కన్వీనర్గా నియమించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ అన్నా వజ్జుల సూర్య ప్రకాశ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 26 వేల మందికి పైగా సభ్యత్వ నమోదు పూర్తయిందని తెలిపారు. ఆలయాల అభివృద్ధి, దేవాదాయ ఆస్తుల పరిరక్షణ, హిందూ ధర్మ ప్రచారం, ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడం లక్ష్యంగా ఈ విభాగం పనిచేస్తుందని చెప్పారు. ఆర్. సతీష్ కుమార్ (నరేష్) మరకత శివలింగ నామకరణ కార్యక్రమాలతో పాటు, ఇటీవల శ్రీ రాధాకృష్ణ ఆలయ స్థాపన కార్యక్రమంలోనూ, పలు దేవాలయాల అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. దైవ సేవ, దేశభక్తి, ధార్మిక కార్యక్రమాల్లో ఆయన సేవలు ఆదర్శప్రాయమని ప్రశంసించారు. నియామకంపై స్పందించిన సతీష్ కుమార్ (నరేష్), తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర బీజేపీ నాయకత్వానికి, ముఖ్యంగా రాష్ట్ర ఎండోన్మెంట్ సెల్ కన్వీనర్ అన్నా వజ్జుల సూర్య ప్రకాశ్కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆలయాల భూముల పరిరక్షణ, దేవాదాయ ఆస్తుల సంరక్షణ, హిందూ ధర్మ పరిరక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో–కన్వీనర్ నిరంజన్ దేశాయి, రంగారెడ్డి జిల్లా కో–కన్వీనర్ నర్సింగ్ రావు, శంకర్ స్వామి, యోగేష్ ప్రభూజీ, కృష్ణ స్వామి చాముండేశ్వర్, పార్టీ నాయకులు, న్యాయవాదులు, సలహాదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి

**ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**



**ఉద్యమ కెరటం, మిర్యాలగూడ :**
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ మండలంలోని వెంకటాద్రిపాలెం, తుంగపాడు గ్రామాలతో పాటు దామరచర్ల మండలంలోని కొండ్రపోల్ గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. బూత్లలో నమోదవుతున్న దరఖాస్తులు, ఓటరు వివరాల సవరణ, కొత్త ఓటర్ల నమోదు, అవసరమైన ధ్రువపత్రాల పరిశీలన, ప్రజలకు అందుతున్న సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బూత్ స్థాయి అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే, పెండింగ్లో ఉన్న దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని, ప్రతి అర్హుడైన ఓటరికి న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు తగిన అవగాహన కల్పిస్తూ, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని ఆదేశించారు. అలాగే బూత్ స్థాయి ప్రతినిధులు కూడా పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తూ ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, ఓటరు జాబితా సవరణ కార్యక్రమం విజయవంతం కావడానికి అధికారులతో సమన్వయంగా పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా అత్యంత కీలకమని, ప్రతి అర్హుడి పేరు జాబితాలో ఉండేలా అధికారులు, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# ఓటర్ల ఎన్యుమరేషన్ గడువును ఆగస్టు 30 వరకు పొడిగించాలి

**ఉద్యమ కెరటం, మిర్యాలగూడ**
తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల ఎన్యుమరేషన్ ప్రక్రియ గడువును ఆగస్టు 30 వరకు అవకాశం కల్పించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు పతాని శ్రీను ఎన్నికల కమిషన్ను కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్యుమరేషన్ ప్రక్రియలో జాప్యం నెలకొన్నదని, ఇప్పటికీ అనేక గ్రామాల్లో ఫారాలు పూర్తిస్థాయిలో ప్రజలకు చేరలేదని ఆయన తెలిపారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు తిరిగి వచ్చి వివరాలు నమోదు చేసుకునేందుకు అదనపు సమయం అవసరమని పేర్కొన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ఊపందుకోవడం, ప్రజల్లో అవగాహన లోపం, ఫారాలపై ఉన్న సందేహాల వల్ల ప్రక్రియ మందగించిందన్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజల అపోహలను తొలగించి, ఓటర్లందరికీ వివరాలు నమోదు చేసుకునే అవకాశం కల్పించేలా ఎన్యుమరేషన్ గడువును ఆగస్టు 30 వరకు పొడిగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్లో మంచిర్యాల జిల్లా కు రెండో స్థానం

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:**
కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ 2025–26 విద్యా సంవత్సరానికి విడుదల చేసిన పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ లో 360 స్కోర్తో మంచిర్యాల జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి పి. చంద్రయ్య, ఇతర అధికారులతో కలిసి పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరంలో 324 స్కోర్తో రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచిన మంచిర్యాల జిల్లా, అన్ని విభాగాల్లో పనితీరును మెరుగుపర్చుకొని ఈ ఏడాది 360 స్కోర్ సాధించి రెండో స్థానానికి చేరుకుందని తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్రం కూడా తన పనితీరును మెరుగుపర్చుకొని జాతీయ స్థాయిలో 18వ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. మరుగుదొడ్లు లేని పాఠశాలలను గుర్తించి అవసరమైన సదుపాయాలు కల్పించడం, 'అమ్మ ఆదర్శ పాఠశాల' కార్యక్రమం ద్వారా తాగునీరు, విద్యుత్, తరగతి గదుల మరమ్మతులు చేపట్టడం, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలకు అనుబంధంగా ఉన్న వసతి గృహాల్లో అదనపు గదులు, భోజనశాలలు, వంటశాలలు, మరుగుదొడ్లు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్లు, ఆర్ఓ వాటర్ ప్లాంట్లు, ఇంటర్మీడియట్ బ్లాక్ల నిర్మాణం వంటి చర్యలతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు బలోపేతమయ్యాయని తెలిపారు. పాఠశాలల పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు సుమారు 50 మంది సభ్యులతో ఎనిమిది తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి 485 పాఠశాలలను సమగ్రంగా తనిఖీ చేసినట్లు చెప్పారు. అలాగే డిజిటల్ విద్యకు ప్రాధాన్యం ఇవ్వడం పట్ల డిజిటల్ విద్యా విభాగంలో జిల్లా స్కోరు గణనీయంగా మెరుగుపడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు ఎం.భరత్ కుమార్, జంబోజు సత్తయ్య, కృష్ణమూర్తి, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించాలి

- సాంకేతిక సేవలను ప్రజలకు చేరవేయాలి
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**ఉద్యమ కెరటం, తాండూర్:** గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు మరింత చేరువగా, విశ్వాసాన్ని పెంపొందించేలా స్నేహపూర్వక పోలీసింగ్ అందించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీస్ శాఖలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక సేవలను ప్రజలకు విస్తృతంగా చేరవేసి, వాటిపై అవగాహన కల్పించాలని సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం మంచిర్యాల జోన్లోని మాదారం పోలీస్ స్టేషన్ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్కు మంచిర్యాల జోన్ డీసీపీ ఎ.భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, తాండూర్ సీఐ దేవయ్య, ఎస్సై సౌజన్య పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సాయుధ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. పోలీస్ స్టేషన్ ఆవరణ, వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, క్రీడా ప్రాంగణం, పోలీస్ వాహనాల నిర్వహణను పరిశీలించిన కమిషనర్, ప్రతి వాహనంలో ఫస్ట్ ఎయిడ్ కిట్, డ్రాగన్ లైట్, తాళ్లు, ట్రాఫిక్ కోన్స్, క్రైమ్ ప్రొటెక్షన్ రిబ్బన్, రైట్ గేర్ కిట్ వంటి అత్యవసర సామాగ్రి తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అనంతరం కమ్యూనికేషన్ వ్యవస్థ పనితీరును పరిశీలించి, కంట్రోల్ రూమ్ సిబ్బంది స్పందనను కమ్యూనికేషన్ సెట్ ద్వారా పరీక్షించారు. స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసులు, రౌడీషీటర్లు, అనుమానితుల వివరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారి విధులు, సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మాదారం పోలీస్ స్టేషన్ పరిధిలోని విస్తారమైన గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్ అందించాలని సూచించారు. గిరిజనులతో సున్నితంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను అర్థం చేసుకుని విశ్వాసాన్ని పెంపొందించాలని అన్నారు. సీసీటీఎన్ఎస్, హాక్ఐ, టీఎస్ కాప్ వంటి సాంకేతిక సేవలను సమర్థవంతంగా వినియోగించడంతో పాటు పాస్పోర్ట్ ధృవీకరణ, ధ్రువపత్రాల జారీ, ఆన్లైన్ ఫిర్యాదుల వంటి సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. మహిళల భద్రత, చిన్నారుల రక్షణకు చేపడుతున్న 'ఆపరేషన్ ముస్కాన్' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, గంజాయి, ఇతర మత్తు పదార్థాల దుష్పరిణామాలపై పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు, యువత, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే సీసీ కెమెరాల ఏర్పాటు, సైబర్ నేరాల నివారణ, రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో నిరంతర అవగాహన కల్పించాలని సూచించారు. స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్, ఆకస్మిక వాహన తనిఖీలు నిరంతరం నిర్వహించి నేరాల నియంత్రణతో పాటు ముందస్తు సమాచార సేకరణపై దృష్టి సారించాలని ఆదేశించారు. భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల వంటి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఎమర్జెన్సీ రెస్పాన్స్ ప్లాన్ సిద్ధంగా ఉంచాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసు అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఆయన వెంట పోలీసు అధికారులు ఉన్నారు.






# క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలోని జిల్లా క్రీడా పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన హైజంప్ మ్యాట్తో పాటు మల్టీ డిజిటల్ ప్యానెల్ యూనిట్ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ మీట్ సందర్భంగా అథ్లెటిక్ అసోసియేషన్ చేసిన విజ్ఞప్తి మేరకు జిల్లాలోని జాతీయ, రాష్ట్రస్థాయి పతక విజేతల శిక్షణ కోసం ప్రభుత్వ గ్రాంట్ నిధుల నుంచి రూ.4.95 లక్షల వ్యయంతో హైజంప్ మ్యాట్ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే క్రీడాకారులకు యూనిఫాంలు, షూస్ వంటి కనీస సౌకర్యాలు కల్పించామని, విద్యాశాఖ అందజేసిన మల్టీ డిజిటల్ ప్యానెల్ యూనిట్ను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. త్వరలోనే స్విమ్మింగ్ పూల్ వద్ద మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్ నిర్మాణం, స్పోర్ట్స్ స్కూల్లో గీజర్ ఏర్పాటు, పెయింటింగ్ పనులను పూర్తి చేస్తామని తెలిపారు. విద్యార్థులు ప్రస్తావించిన డైట్ సమస్యను కాంట్రాక్టర్తో చర్చించి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జిల్లాకు గర్వకారణంగా నిలిచిన జిల్లా క్రీడా పాఠశాల నుంచి అనేక మంది క్రీడాకారులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధిస్తున్నారని అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఇందులో భాగంగానే 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ' ప్రారంభం కానుందని చెప్పారు. అలాగే జిల్లాలో జూడో, రెజ్లింగ్, కబడ్డీ మ్యాట్లను సీఎస్ఆర్ నిధులతో త్వరలో ఏర్పాటు చేసి క్రీడా మౌలిక వసతులను మరింత బలోపేతం చేస్తామని వివరించారు. అనంతరం క్రీడా విద్యార్థులు నిర్వహించిన హైజంప్ ప్రదర్శనను తిలకించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ దయానంద్ రెడ్డి, గిరిజన సంక్షేమ క్రీడల అధికారి పార్థసారథి, కోచ్లు, క్రీడా విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# టీయూడబ్ల్యూజే–ఐజేయూ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక..

**ఉద్యమ కెరటం, పటాన్చెరు:**
తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే–ఐజేయూ) సంగారెడ్డి జిల్లా మహాసభలు గురువారం సంగారెడ్డి కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో ఘనంగా నిర్వహించారు.మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు, వారి పిల్లలకు విద్యాసంస్థల్లో రాయితీలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని హామీ ఇచ్చారు.మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ జర్నలిస్టులకు రైల్వే పాసుల మంజూరు అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సానుకూల నిర్ణయం తీసుకునేలా ప్రయత్నిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గంలో జిల్లా అధ్యక్షుడిగా బండారు యాదగిరి,జిల్లా ప్రధాన కార్యదర్శిగా అనిల్ కుమార్, ఉపాధ్యక్షునిగా శ్రీనాథ్, జాయింట్ సెక్రటరీగా శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శిగా చెన్న బసవేశ్వర్, జాయింట్ సెక్రటరీగా భూపాల్ రెడ్డి, స్మాల్ అండ్ మీడియం పత్రికల జిల్లా ట్రెజరర్గా మన్నె లక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.మహాసభలకు హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీకి ముత్తంగి వద్ద పటాన్చెరు టీయూడబ్ల్యూజే–ఐజేయూ జర్నలిస్టులు గజమాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన మహాసభలు విజయవంతంగా సాగాయి.జిల్లా కార్యవర్గం, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గాల్లో పటాన్చెరు నియోజకవర్గానికి ఐదు కీలక పదవులు దక్కడం విశేషంగా నిలిచింది. తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైసల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్వల మల్లికార్జున్ రెడ్డి, విష్ణు ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు యాదగిరి తదితర నాయకులకు నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.తెలంగాణలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సంఘం బలోపేతం, సభ్యుల సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేస్తామని వారు పేర్కొన్నారు. అందరి సహకారంతో టీయూడబ్ల్యూజే–ఐజేయూను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.

